
కమీషన్‌కు.. లోను కావాల్సిందే!

- డ్వాక్రా మహిళలపై ఆర్పీ, యానిమేటర్ల దోపిడీ!
- రుణం పొందాలంటే మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే
- ఒక్కో గ్రూపు నుంచి రూ. 10వేల నుంచి 15వేలు వసూలు
- పొదుపు రుణాల్లోనూ వాటాకు డిమాండ్



రుణాలు మంజూరు కావాలంటే.. ముందుగానే కమీషన్‌కు లోను కావాల్సిందేనని పొదుపు సంఘాల మహిళలపై ఆర్పీలు, యాని మేటర్లు బెదిరింపులకు పాల్పడుతున్నారు. డ్వాక్రా గ్రూపులకు బ్యాంకులు.. రుణ చెల్లింపులు బాగా ఉండి, రుణం ఇచ్చేందుకు ముందుకు వచ్చినా సరే వాటికి మోకా లడ్డు తున్నారు. ముందుగా కమీషన్ చెల్లిస్తేనే రుణానికి దరఖాస్తు పెడతా మని తెగేసి చెబుతున్నారు. ఇలా డ్వాక్రా మహి ళలపై యానిమేటర్లు, రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)ల దోపిడీ నిత్యకృత్యంగా మారి పోయింది. కానీ, వారిపై ఫిర్యాదు చేసేం దుకు పొదుపు మహిళలు ముందుకు రావడం లేదు. ఒక వేళ వచ్చినా తగిన చర్యలుంటాయన్న ఆశా వారికి లేదు.


> ప్రత్తిపాడు మండలంలో డ్వాక్రా గ్రూపులకు రుణాలు మంజూరు కావాలంటే.. తమకు కమీషన్లు ఇవ్వాల్సిందేనంటూ యానిమేటర్లు పట్టుబట్టిన విషయం తాజాగా వెలుగు చూసింది. యానిమేటర్ మొదలు ఏపీఎం వరకూ చేతులు తడిపితేనే రుణాలు వస్తాయంటూ బెదిరింపులు శృతిమించడంతో వివాదం రచ్చకెక్కింది.



నరసరావుపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపుల మహిళలను మామూళ్ల గద్దలు వేదించుకు తింటున్నాయి. డ్వాక్రా సంఘాల్లో ఏ చిన్న పని జరగాలన్నా చేయి తడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్వావలంబన కోసం ఇచ్చే రుణాలు మొదలు అత్యవసర పరిస్థితుల్లో తాము దాచుకున్న పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా గ్రూపు సభ్యులైన మహిళలు భారీ మొత్తంలో కమీషన్ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరి స్థితిపై మహిళలు గగ్గోలు పెడుతున్నా.. ఏమాత్రం వెరవకుండా పట్టణాల్లోని మెప్మా రిసోర్స్ పర్సన్లు, గ్రామాల్లోని సెర్ప్ యాని మేటర్లు అందినకాడికి మహిళలను దోచేస్తున్నారు.

● రాబందుల్లా ఆర్పీ, యానిమేటర్లు

ఉమ్మడి జిల్లాలో గ్రామీణాభివృద్ధి (మిగతా 6వ పేజీలో)



నరసరావుపేట : లింగంగుంట్లలో జల్‌జీవన్ మిషన్ కింద నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్

జలజీవన్ మిషన్ పథకం కింద తాగు నీటి పథకాల అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. బిల్లులు చెల్లించకపోతుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. దాదాపు రూ.33 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. వీటి చెల్లింపులో జాప్యం పథకానికి శాపంగా మారింది. పల్లెల్లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వడంలో పాలకులు విఫలమవుతున్నారు. ఆది నుంచి జలజీవన్ అమలులో నిర్లక్ష్యం తాండవిస్తోంది. పురోగతిలో జిల్లా రాష్ట్రంలోనే చిట్టచివరన నిలవడం గమనార్హం. బకాయిలు చెల్లిస్తేనే పనులు ముందుకు సాగే పరిస్థితి నెలకొంది.

- నత్తనడకన 'జలజీవన్ మిషన్' పనులు
- బిల్లుల బకాయి రూ.33 కోట్లు!
- పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- పురోగతిలో అట్టడుగున పల్నాడు జిల్లా

నీరుగారిన లక్ష్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇంటింటికి రక్షిత నీటిని అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను 2019లో అమల్లోకి తీసుకొచ్చింది. తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి.. ప్రతి గ్రామంలో నూరు శాతం కుళాయిల ద్వారా నీరు సరఫరా చేయడమే దీని లక్ష్యం. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు కేటాయించాలి. కేంద్రం తన వాటా నిధులు విడుదల చేసినా.. గత వైసీపీ ప్రభుత్వం సదరు పథకానికి ఆ నిధులు ఖర్చు చేయకుండా దారి మళ్లించడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

లక్ష్యం చేరక..

జల్ జీవన్ పథకం ద్వారా పల్లెల్లో ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వడమే లక్ష్యం. ప్రస్తుతం ఉన్న నీటి పథకాలు 40 లీటర్లు నీరు ఇచ్చే విధంగా రూపొందించబడ్డాయి. ప్రధానంగా ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల స్నింటిలో రక్షిత నీరు అందించడం కూడా జల్ జీవన్ పథకం లక్ష్యమే. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు నిర్వహిస్తున్నారు. 2024 మార్చి కల్లా జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. కానీ, పనులు నత్తనడకన సాగడంతో.. ఈ పథ కాన్ని 2026 మార్చి వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించింది.

అట్టడుగు స్థానంలో పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలోని గ్రామాల్లో 4,34,399 గృహాలు ఉన్నాయి. జల్ జీవన్ పథకం ప్రారంభించే నాటికి 58,166 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 97,763 కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఇంకా 2,78,470 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి. ప్రస్తుతం 35.90 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ అమలులో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా అట్టడుగున 26వ స్థానంలో నిలిచింది. ఈ పథకం కింద జిల్లాలో 1,055 పనులు గుర్తించారు. ఇందుకు రూ.508.16 కోట్లు వ్యయం అంచనా వేశారు. రూ.235 కోట్లతో 574 పనులు చేపట్టగా.. వీటిలో 317 పనులు పూర్తియ్యాయి. 236 పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. 19 పనులు ఇంకా చేపట్ట లేదు. పూర్తయిన పనులకు రూ.79 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.33 కోట్ల బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. కేవలం 16 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయిల కనెక్షన్లు ఉన్నాయి.

16 శాతం వృద్ధి రేటు లక్ష్యం

నరసరావు పేట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ, ఆక్వా రంగాల్లో 16 శాతం వృద్ధి సాధించేలా ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం సదరు శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. నాణ్యమైన పశువుల ద్వారా పాల ఉత్పత్తి పెంచే అవకాశాలపై దృష్టిసారించి, జిల్లాలో 50 వేల కృత్రిమ గర్భధారణ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద రెండు వేల పశువుల షెల్టర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. 1,17,000 ఎకరాల్లో ఆక్వా పెంపకం చేపట్టాలని సూచించారు. అలాగే కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారి(167ఏజీ) పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించించారు. జాతీయ రహదారులు 167ఏజీ, 167ఏ నిర్మాణ పనులపై సదరు అధికారులతో ఆమె సమీక్షించారు. రద్దీ ఎక్కువగా ఉండే సత్తెనపల్లి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి, పూర్తి చేయాలన్నారు.



సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ సూరజ్ ధనుంజయ్ తదితరులు

డిసెంబరు నాటికి రూ.55 కోట్ల పనుల లక్ష్యానికి మించి పనులు చేయాలని దిశానిర్దేశం చేశారు. నకరికల్లు-వాడరేవు జాతీయరహదారి (167ఏ) భూ సేకరణకు రైతులతో చర్చించి ధరలు నిర్ధారించాలన్నారు. సమావేశంలో జేసీ సూరజ్, డీఆర్వో మురళి, ఎన్‌హెచ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంజీవరాయుడు, జిల్లా పశుసంవర్థక, మత్స్యశాఖల అధికారులు రామారావు, వెంకటరావు, మైక్రో ఇరిగేషన్ పీడీ ఆంజనేయులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు 3 నుంచి శిక్షణ తరగతులు

- ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల ఏర్పాట్లు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు వచ్చే నెల 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నా యి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో.. గుంటూరు, పల్నాడు, బాపట్ల ప్రాంతాల్లోని కళాశాలల్లో శిక్షణ తరగ తులు నిర్వహించనున్నారు. ఇందుకోసం విద్యాశాఖ ఏర్పా ట్లు చేస్తోంది. జోన్-3 పరిధిలో దాదాపు 1,600 మంది వరకు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇటీవల వీరికి నియామక పత్రాలను ప్రభుత్వం జారీ చేసింది. పాఠశా లల్లో వారికి పోస్టింగ్ ఇచ్చేందుకు అవసరమైన ప్రాథమిక శిక్షణను విద్యాశాఖ అందించనుంది.

శిక్షణ తరగతులు ఇలా..

- డీఎస్సీ కన్వీనర్ జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం తొలుత ప్రాథమిక శిక్షణ అందిస్తారు. విద్యాబోధనలో ప్రావీణ్యం, విద్యాశాఖ విధానాలు, కార్యక్రమాలపై అవగా హన కల్పిస్తారు.
- విద్యాహక్కు, బాలల హక్కులు వంటి ముఖ్యమైన చట్టాలను వివరిస్తారు. పాఠశాలల్లో మొదటితరం(ఫస్ట్ జనరేషన్)లో చదువుకుంటున్న పిల్లల పట్ల బాధ్య తలను గుర్తెరిగేలా చేస్తారు. జాతీయ విద్యా విధానం, రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పిస్తారు.
- పాఠ్య ప్రణాళికల తయారీ, బోధన పద్ధతులు, మూల్యాంకన విధానాలు, నిత్య విద్యార్థిగా ఉంటూ బోధ నను మెరుగు పరుచుకోవడం, విద్యార్థుల్లో సృజనాత్మ కతను గుర్తించడం వంటి అంశాలపై సవివరంగా శిక్షణ ఇస్తారు. విద్యాబోధనలో డిజిటలైజేషన్‌కు అనుగుణంగా శిక్షణ ఇవ్వనున్నారు. డిజిటల్ టూల్స్, సాంకేతిక బోధన విధా నాలపై పరిచయం కల్పిస్తారు.
- కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు శిక్షణకు నిర్దేశిం చిన ప్రాంతాల్లో తప్పక హాజరు కావాలని విద్యాశాఖ స్పష్టం చేసింది. శిక్షణ పూర్తయ్యాక పోస్టింగ్ ఆర్డర్లు ఇస్తారు. ప్రతి ఒక్కరూ శిక్షణకు హాజరు కావాల్సిందేనని, ఎవరికి ఇందులో మినహాయింపు లేదని డీఈఓ, సీవీ రేణుక పేర్కొన్నారు.



కళాకారులను అభినందిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్

విశ్వకవికి బీజేపీ అరుదైన గౌరవం

వినుకొండటౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తిమ్మాయపాలెం రోడ్డులోని వై.కన్వెన్షన్ హాలులో విశ్వకవి గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలు ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులతో జాషువా పద్యనాటక పోటీలు నిర్వహించారు. అనంతరం జాషువా చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ మాట్లాడుతూ జాషువా పుట్టిన గడ్డపై ఆయన రచనలు మరచిపోలేమన్నారు. వినుకొండ అంటే జాషువా గుర్తుకువస్తారని పేర్కొన్నారు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు ఆయన రచనలు నేటికి ఆదర్శంగా నిలిచాయన్నారు. పలు వేషధారణల్లో జాషువా పద్య నాటక ప్రదర్శన చేసిన కళాకారులను శశికుమార్ అభినందించి, మెమెంటోలు ప్రదానం చేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వినుకొండకు వస్తారన్న సమాచారంతో.. ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆయన రాకపోవడంతో కార్యకర్తల్లో తీవ్ర నిరాశ ఏర్పడింది.

సందిగ్ధ వాతావరణంలో పత్తి



ఉమ్మడి గుంటూరు జిల్లాలో పత్తి తీతలు ఆరంభం కానున్నాయి. సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాలపై ఇంకా స్పష్టత రాలేదు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం సీసీఐ రెండో విడత నోటిఫికేషన్‌ను కూడా జిన్నర్లు (పత్తి మిల్లుల యజమానులు) బహిష్కరించారు. సీసీఐ, జిన్నర్లు మధ్య ప్రతిష్టంభనను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నా.. సఫలీకృతం కావడం లేదు.

- అక్టోబర్‌లో ఆరంభం కానున్న తీతలు
- ఇంత వరకు ఖరారు కాని కొనుగోలు కేంద్రాలు
- నిబంధనల సడలింపులపై జిన్నర్లు పట్టు
- సీసీఐ రెండోవ టెండర్ నోటిఫికేషన్‌కు స్పందన నిల్

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ప్రతి ఏటా అక్టోబర్ 21 నుంచి అధికారికంగా సీసీఐ కొనుగోళ్లు ఆరంభించేది. కేంద్రాలపై ముందు గానే స్పష్టత వచ్చేది. ఈ సారి ఆ పరిస్థితి లేదు. నిబంధనల సడలింపు కోసం జిన్నర్లు పట్టు బడుతుండగా.. సీసీఐ మెత్తబడే అవకాశాలు పెద్దగా కనిపించడం లేదు. ఇంతటి సందిగ్ధ వాతావరణంలో పత్తి సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా కనిపిస్తోంది.

పక్క రాష్ట్రంలో లేని నిబంధనలు ఇక్కడేలా..

సీసీఐ ఈసారి ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రాల (మిగతా 6వ పేజీలో)

గతేడాది పరిస్థితి ఇదీ..

గతేడాది పత్తితీత సీజన్ ఆరంభమైనా.. సీసీఐ వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. దానివల్ల రైతులకు సరైన గిట్టుబాటు ధర లభించక.. క్వింటా పత్తి రూ.5 వేల నుంచి రూ. 6 వేలకు మాత్రమే అమ్ముకున్నారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జోక్యం చేసుకొని సీసీఐ జనరల్ మేనేజర్‌ను బదిలీ చేయించిన తర్వాత ఉమ్మడి జిల్లాలోని రైతులకు మేలు జరిగింది.



నరసరావుపేట శ్రీ శృంగేరి శంకర మఠం దేవాలయంలో సరస్వతి దేవి అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా దసరా ఉత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి.

నూతన ఉపకులపతి నియామకం ఎప్పుడు..?

● ముందుకు సాగని వర్సిటీ అభివృద్ధి



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

ఏఎన్‌యూ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూకు శాశ్వత ఉపకులపతి నియామకం లేక పోవడంతో వర్సిటీ అభివృద్ధి కుంటుపడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి వీసీ రాజశేఖర్ అధికార దుర్వినియోగం, అవి నీతి, అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తి వీసీ పదవికి రాజీనామా చేయాలంటూ ఆందోళనలు ఉధృతం కావడంతో గత్యంతరం లేక రాజశేఖర్ గతేడాది జూలై ఒకటిన రాజీనామా చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య గంగాధర రావును తాత్కాలిక ఉపకులపతిగా నియమించింది. అంతేకాకుండా శాశ్వత ఉపకు లపతి నియామ కం కోసం రెండుసార్లు సెర్చ్ కమిటీలను ప్రభుత్వం నియమించి నప్పటికీ, నియామకం జరగలేదు. శాశ్వత ఉపకులపతి ఉంటే అన్ని అంశాలపై వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా విశ్వవిద్యాలయం అభివృద్ధి పరుగులు తీసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం తాత్కాలిక ఉపకులపతి పాలనలో కొన్ని కీలక నిర్ణయాలకు నిబంధనలు అడ్డురావడంతో అభివృద్ధి కార్యక్ర మాలపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో విశ్వవిద్యాలయం అభివృద్ధి ముందుకు సాగటం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఎన్‌జీ రంగా వ్యవసాయ వర్సిటీ అక్రమాలపై విచారణ..!

● యూనివర్సిటీ ప్రొఫెసర్ ఫిర్యాదుతో కదలనున్న డొంక

గుంటూరు సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు లాం ఫాం సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమాలపై విచారణ జరగనుంది. ఈ మేరకు వ్యవసాయశాఖకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. యూనివర్సిటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఫిర్యాదు ఆధారంగా ఈ విచారణ జరగనున్నట్లు సమాచారం. ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అక్రమాలపై ఆగస్టు చివరి వారంలో యూనివర్సిటీ ప్రొఫెసర్ ఫిర్యాదు చేశారు. కోరం లేకుండానే ఇంచార్జి వీసీ పాలకవర్గ సమావేశాలు ఏర్పాటు చేశారన్నది ఆయన ప్రధాన ఆరోపణగా కనిపిస్తోంది. ఆరుగురు సభ్యులు ఉంటేనే పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నా కేవలం ఐదుగురితో మాత్రమే నడిపించి కీలక నిర్ణయాలు తీసుకున్నారని గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు. బదిలీలు, నిధుల కేటాయింపు, పదోన్నతుల వ్యవహారంలో కూడా భారీ అవినీతి జరిగిందని ఫిర్యాదులో పేర్కొనటంతో విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

విజిలెన్స్‌కు ఫిర్యాదులు...

ఎన్‌జీ రంగా యూనివర్సిటీ అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఏవయితే ఆరోపణలు చేశారో వాటినే ఉటంకిస్తూ విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించి ఏసీబీ కేసు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

ప్రభుత్వ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యం

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ● దసరా, దీపావళి కానుకగా సుగాలీ మహిళలకు చీరల పంపిణీ


జీఎస్టీ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించడంతో పాటు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కిందని ఆయన అన్నారు. విఠంరాజుపల్లి సమీపంలోని జీవీ గెస్ట్ హౌస్‌లో జీఎస్టీ తగ్గింపుపై మహిళలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గింపు ద్వారా ఎన్డీయే ప్రభుత్వం నిత్యావసర ధరలను సామాన్యు లకు అందుబాటులోకి తీసుకొచ్చిందని అన్నారు. చంద్రబాబు హ యాంలోని కూటమి ప్రభుత్వం పేదలకు సంవత్సరానికి మూడు సిలెండర్లు ఇవ్వడంతో పాటు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహి ళలకు ఆర్థిక వెసులుబాటును కల్పిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ఐఏఎస్, ఐపీఎస్ చదువుకునే ఎస్టీ మహిళలకు రూ. 50వేల స్కాలర్ షిప్ అందజేస్తామని చెప్పారు. ఎస్టీ బిడ్డలు బాగా చదువుకో వాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి స్కాలర్‌షిప్‌లు అందజే స్తామని హామీ ఇచ్చారని అన్నారు. సేవాలల్ దేవాలయ నిర్మాణానికి రూ.5లక్షలు విరాళంగా ఇచ్చి కమిటీ హాల్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. శివశక్తి లీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దసరా, దీపావళిని పురస్కరించుకొని 5 వేల మంది సుగాలీ మహిళ లకు చీరలతో పాటు గాజుల కొనుగోలుకు నగదును అందజేస్తామని జీవీ ఆంజనేయులు ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వ రరావు, మాజీ ఎంపీపీ ఆరికట్ల వాసుదేవరెడ్డి, మేరాజోత్ హనుమా నాయక్, పెసల వెంకటనారాయణ, గుండెనాయక్, గోవిందునాయక్, కౌన్సెలర్ షకీలాతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగు

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి


జీఎస్టీ తగ్గింపుపై సత్తెనపల్లిలో ప్రచారం చేస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్

సత్తెనపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజల తలసరి ఆదాయం మెరుగు పడుతుందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సత్తెనపల్లిలో సోమవారం కిరాణా, మెడికల్, వస్త్ర దుకాణాలను సందర్శించి పలువురు వ్యాపారస్థులు, వినియోగదారులతో జీఎస్టీ తగ్గింపుపై కొమ్మాల పాటి మాట్లాడారు. నాయకులతో కలసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల సామాన్యులకు ఆర్థిక ప్రయోజనంతో పాటు పొదుపు పెరుగుతుందని అన్నారు. తగ్గించిన జీఎస్టీ అమలుకు వ్యాపారులు సహకరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన దీపం, స్త్రీ శక్తి, తల్లికి వందనం పథకాలతో ప్రజలు డబ్బులు పొదుపు చేసుకుంటున్నారని కొమ్మాలపాటి పేర్కొన్నారు. ప్రచారంలో కొమ్మాలపాటి వెంట టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, సయ్యద్ పెద కరిముల్లా, మస్తాన్‌వలి, జవ్వాజి రామ్మోహనరావు, పోతుగంటి రామ కోటేశ్వరరావు, నూర్ బాషా జానీ బాబు, వక్కంటి అజయ్, పోట్ల ఆంజనేయులు, మార్కెట్ రాజు, రాంబో బుడే తదితరులు ఉన్నారు.

ఏకపక్షంగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

● యేల్చూరి ప్యానల్ ఘన విజయం


ఓటరు స్లిప్పులు అందజేస్తున్న యేల్చూరి, ఆతుకూరి

గుంటూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తొలి నుంచి ఉత్కంఠ కలిగించిన ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఏకపక్షంగా సాగాయి. ఈ ఎన్నికల్లో యేల్చూరి ప్యానల్ సభ్యులు ఘన విజయం సాధించారు. ప్రత్యర్థిగా నిలిచిన రంగా బాలకృష్ణ ఇతర సభ్యులు ఓటమి పాలయ్యారు. చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం గడువు ఏడాది పాటు ఉంటుంది. కార్యవర్గం పదవీ కాలం ముగిసేలోపు సర్వసభ్య సమావేశం నిర్వహించి బరిలో ఎవరూ నిలవకపోతే ఎన్నిక ఏకగ్రీవం అయ్యేది. ప్రస్తుత అధ్యక్షుడు యేల్చూరి ప్యానెల్‌పై సుదీర్ఘకాలం చాంబర్ కార్యదర్శిగా వ్యవహరించిన రంగా బాలకృష్ణ వర్గం పోటీకి దిగింది. చాంబర్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఎన్నికలు జరిగాయి. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ సాగింది. జిల్లా కేంద్రం గుంటూరుతో పాటు బాపట్ల, తెనాలి, పల్నాడు ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాలతో జిన్నా టవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయానికి సభ్యులు తరలివచ్చారు. దాంతో చాంబర్ భవనం వద్ద కోలాహలం నెలకొంది. చాంబర్‌లో మొత్తం 3 వేల మంది ఉండగా 700 మంది సభ్యులు ఎన్నికలకు హాజరై ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కౌంటింగ్ నిర్వహించి యేల్చూరి ప్యానల్ ఘన విజయం సాధించినట్లు ఆతుకూరి వెల్లడించారు.

జగ్గాపురంలో భారీ చోరీ

● తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం

● రూ.20లక్షల విలువైన నగలు.. రూ.6 వేల నగదు దోపిడి

యడ్లపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం జగ్గాపురం గ్రామంలో భారీ చోరీ జరిగింది. అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడిన దుండగులు బంగారు, వెండి వస్తువులతోపాటు నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన షేక్ బాజీవలి, మీరాబి వట్టిచెరుకూరు మండలం కుర్నూతల 5వ మైలు అడ్డరోడ్డు సెంటర్‌లో చిల్లర దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. సాధారణంగా ప్రతిరోజు సాయంత్రం దుకాణం మూసివేసి ఇంటికి వస్తుంటారు, ఆలస్యమ యితే కొట్టు వద్దనే నిద్రిస్తుంటారు. ఆదివారం రాత్రి వారు దుకాణం వద్దనే నిద్రించారు. సోమవారం ఉదయం బాజీ ఇంటి వద్దకు వచ్చా డు. అయితే ఇంటి తలుపు తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి కంగారుగా ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా.. కబోర్డులో చీరల మధ్యన దాచి ఉంచిన సుమారు 130 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు జతల వెండి పట్టీలు, రూ.6వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే యడ్లపాడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు. కాగా, చోరీకి గురైన బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.20లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు.

కమీషన్‌కు లోనుకావాల్సిందే..!

(5వ పేజీ తరువాయి)

శాఖ పరిధిలో 74,640 స్వయం సహాయక బృందాలు (డ్వాక్రా గ్రూపులు) ఉన్నాయి. వాటిలో ఏడున్నర లక్షల మందికి పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు. గ్రూపు నిర్వహణ, సభ్యుల సమావేశం, కార్యకలాపాల్లో సహాయ సహకారాలు అందించేందుకు పట్టణ ప్రాంతాల్లో రిసోర్స్ పర్సన్లను మెప్మా నియమించగా, గ్రామీణ ప్రాంతాల్లో యానిమేటర్లను గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్ నియమించింది. ఇలా గ్రూపు మహిళలకు సహాయ, సహకారాలు అందించడం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇప్పుడు రాబందుల వ్యవస్థగా మారిపోయింది. గ్రూపు మహిళలను పీడించుకుతింటున్నారు. డ్వాక్రా మహిళలు తమకు కమీషన్ చెల్లించడం అనేది హక్కుగా చెబుతూ వారిపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. ఒక్కో పనికి రేటు కట్టి మామూళ్లు వసూళ్లు చేస్తున్నారు.

● రుణం పొందాలంటే రూ. 10వేలు ఇవ్వాల్సిందే!

డ్వాక్రా గ్రూపుల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణ సహాయం చేస్తుంది. ఏదో ఒక స్వయం ఉపాధి పొందుతూ.. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఆ రుణాలు తోడ్పడుతాయి. రుణం తీరిన వెంటనే మరోమారు రుణాలు అందిస్తుంది. నిరంతరం జరిగే ఈ ప్రక్రియను యానిమేటర్లు, ఆర్పీలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. డ్వాక్రా సంఘాలకు ఇచ్చే రుణాలు బ్యాంకుల నుంచి సభ్యుల ఖాతాల్లో జమ కావాలంటే యానిమేటర్ లేదా ఆర్పీ తీర్మానం రాసి, సీసీ, ఏపీఎం సంతకాలు చేయించి అప్రూవల్ చేయించాలి. ఇదే వారికి వరంగా మారింది. దీనిని అడ్డం పెట్టుకుని ప్రతిసారి ఇలా రుణం పొందే సమయంలో ఒక్కో మహిళ నుంచి రూ.వెయ్యి, రూ.1,500 వరకూ, లేదంటే గ్రూపు మొత్తంగా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ ఆర్పీలు, యానిమేటర్లు వసూలు చేస్తున్నారు. పొందుపు మహిళలు ఇవ్వడానికి ఇష్టపడకపోతే తీర్మానాలు రాయకుండా ఆపుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా వెరవని స్థితికి వారు చేరారు. మహిళలు ఫిర్యాదులు చేయకుండా బెదిరింపులకు దిగుతున్నారు. వీటితోపాటు అత్యవసర సమయంలో పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా వీరి మామూళ్ల బాదుడు తప్పడం లేదు. గ్రూపునకు రూ.2వేల నుంచి రూ.4వేలు ఇవ్వకుండా పని మాత్రం జరగడం లేదు. వీటితోపాటు ప్రతి నెలా నిర్వహించే గ్రూపు సమావేశంలో సమావేశంలోని అంశాలు, తీర్మానాలు రాసినందుకు రూ.500 నుంచి వెయ్యి రూపాయలు వసూలు చేస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళలు లబోదిబో మంటున్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

సందిగ్ధ వాతావరణంలో పత్తి

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు కోసం తెచ్చిన నిబంధనలు చాలా సంక్లిష్టమైనవని జిన్నర్లు అంటున్నారు. పక్క రాష్ట్రంలో పెట్టని నిబంధనలు ఇక్కడ అమలు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దూది శాతం (ఓటీ) గతం కంటే ఈ ఏడాది ఎక్కువ రావాలన్న డిమాండ్‌ను జిన్నర్లు స్వాగతించడం లేదు. రాష్ట్రంలోని భూమి స్వభావం, వాతావరణం, విత్తనాల స్వభావం సీసీఐ చెబుతున్న శాతాన్ని చేరుకోలేవని అంటున్నారు. దానితో పాటు దేశంలోని టెక్స్‌టైల్ కమిటీ ఇచ్చిన రేటింగ్ ఆధారంగా ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3, ఎల్ 4, ఎల్ 5 సెంటర్లు ఎంపిక చేయాలన్న ది జిన్నర్ల ప్రధాన సూచన. ఎందుకంటే టెక్స్‌టైల్ కమిటీ అన్ని మిల్లులను పరిశీలించి.. అక్కడ ఉన్న మౌలిక వసతులు, భద్రతా నిర్వహణ, మిల్లులోనే వేబ్రిడ్జి ఏర్పాటు ఆధారం గా స్టార్ రేటింగ్ నిర్ణయిస్తుంది. దేశంలోని అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఈ రేటింగ్ ఇవ్వడం జరుగుతుంది. సీసీఐ మాత్రం బయ్యర్లు మిల్లులు తనిఖీ చేసి ఇచ్చే నివేదిక ఆధారంగా కేంద్రాలు ఎంపిక చేస్తామని చెబుతుండటం వివాదం రేపుతోంది. ఈ విషయాలు తేల్చకుండా టెండర్లు వేయమంటే తాము వేసేది లేదని జిన్నర్లు అంటున్నారు. ఈ వ్యవహారం తేలితే తప్ప పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగదు.

ఆలస్యం అయితే ఇబ్బందే

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పల్నాడు ప్రాంతంలో సుమారు 1.45 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేస్తున్నారు. అక్టోబర్ మొదటి వారంలోనే ముదురు పత్తి తీతకు సిద్ధమవుతుంది. గుళ్లలు పగిలిన వెంటనే పత్తి తీయకపోతే అక్టోబర్‌లో వచ్చే తుపాన్‌లు, వాన ముసురుకు పూర్తిగా పత్తి పాడవుతుంది. తీసిన పత్తిని వెంటనే అమ్ముకునే సంప్రదాయం ఆ ప్రాంతంలో ఉంది. సీసీఐ కేంద్రాలు ఉంటే పత్తికి మద్దతు ధర లభిస్తుంది. లేకపోతే దళారులు తెల్ల బంగారాన్ని అతి తక్కువ ధరకే కొనుగోలు చేయడం ప్రారంభిస్తారు. ఈ ఏడాది కూడా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 12 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ ఏడాది క్వింటా పత్తి ధర రూ.8,110 (మొదటి శ్రేణి నాణ్యత), దిగువ శ్రేణి నాణ్యత పత్తి కి రూ.7,710 మద్దతు ధరగా నిర్ణయించారు. సీసీఐ ప్రకటించిన ధరపై రైతులు చాలా వరకు సంతృప్తిగా ఉన్నప్పటికీ కేంద్రాలు ఏర్పాటుపై స్పష్టత రాకపోవటం ఆందోళన కలిగిస్తోంది.

ఏ యాప్ ఉంటుంది

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో.. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా రైతు ప్రయోజనాలకు పెద్ద పీట వేసింది. ఆ నేపథ్యంలోనే జిన్నర్లు సడలించాలని కోరుతున్న నిబంధనలను.. పరిశీలించాలని ప్రభుత్వం సీసీఐకి సూచిస్తోంది. గతంలో సీసీఐ పత్తి కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో తెచ్చిన సీఎం యాప్‌ను వినియోగించేవారు. ఈ యాప్ అందుబాటులోకి రావడం వల్ల కొనుగోళ్లలో అక్రమాలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం తర్వాత సీసీఐ కిసాన్ యాప్‌ను తెరపైకి తెచ్చింది. దానిని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ఏఎన్‌యూ ఫార్మసీ పరీక్ష ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది నిర్వహించిన ఫార్మసీ రీవాల్యుయేషన్ 1 నుంచి 7వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగిందని తెలిపారు. అలాగే బీ-టెక్ రెగ్యులర్ రెండో ఏడాది 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను కూడా విడుదల చేసినట్లు చెప్పారు. పరీక్ష ఫలితాలు ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రైలు కిందపడి ప్రేమ జంట ఆత్మహత్య

● మృతులు బీటెక్ విద్యార్థులు


శ్రీనివాసరావు, లక్ష్మీ ప్రియాంక(ఫైల్)

మేడికొండూరు సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం పేరేచర్ల -ఫిరంగిపురం స్టేషన్ల మధ్య ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది. పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన కోడె శ్రీనివాసరావు (20), కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన బి.లక్ష్మీ ప్రియాంక పేరేచర్ల సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. కొంతకాలంగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం ఇంట్లో చెప్పి పెళ్లి చేసుకుందామని ప్రయత్నించారు. ఇందుకు శ్రీనివాసరావు తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో వీరిద్దరూ గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 5న ఫిర్యాదు చేశారు. తామిద్దరం ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నామని పెద్దలు అంగీకరించడం లేదని చెప్పారు. దీంతో పట్టాభిపురం పోలీసులు ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అనంతరం వీరిద్దరూ పేరేచర్లకు చేరుకొని కళాశాలకు వెళ్లడం ప్రారంభించారు. లక్ష్మీ ప్రియాంక హాస్టల్‌లో ఉంటుండగా, శ్రీనివాసరావు తన స్నేహితులతో కలిసి గదిలో ఉంటున్నాడు. అయితే శ్రీనివాసరావు తల్లిదం డ్రులు పెళ్లికి అంగీకరించేది లేదని తేల్చిచెబుతూ మాట్లాడటం మానేశారు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాసరావు ఈ నెల 27న రాత్రి పేరేచర్ల-ఫిరంగిపురం రైల్వేస్టేషన్ల మధ్య ట్రైన్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న లక్ష్మీ ప్రియాంక 28వ తేదీన ఉదయం అదే ప్రాంతానికి చేరుకొని రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వీరిద్దరి మృతదేహాలను నరసరావుపేట రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వీరి మరణంతో కళాశాలతో పాటు వారి వారి గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. వారి తలిదండ్రులు బోరున విలపించారు.

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరి మృతి

తాడికొండ సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిడుముక్కలలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. అమరావతి మండలం కర్లపూడి గ్రామానికి చెందిన కుంభ శ్రీనివాసరావు (26) తన వ్యక్తిగత పనుల నిమిత్తం గుంటూరుకు వెళ్లి తిరిగి తన స్వగ్రామానికి బైక్ పై బయలుదేరాడు. తాడేపల్లికి చెందిన మరో వ్యక్తి నిడుముక్కలలో ఉన్న తన సోదరితో కలిసి గుంటూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో నిడుముక్కలలోని కళాజ్యోతి సమీపంలోకి రాగానే ఎదురెదురుగా వస్తున్న వీరి బైకులు బలంగా ఢీకొన్నాయి. దీంతో ఇరువురు వ్యక్తులకు తీవ్రగా యాలయ్యాయి. చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా మార్గ మధ్యలో శ్రీనివాసరావు మృతి చెందాడు. తాడేపల్లికి చెందిన వ్యక్తి చికిత్స పొం దుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని పూర్తి వివరాలు తెలియరాలేదు. తాడికొండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు దిగి ఇద్దరు విద్యార్థుల గల్లంతు


షేక్ హర్షద్(ఫైల్)


మార్క్‌రూఫస్(ఫైల్)

నకరికల్లు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామ సమీపంలో సాగర్ కుడి కాలువలో ఈత కొట్టేందుకు దిగి ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. చిలకలూరిపేటకు చెందిన హర్షద్, బాపట్ల జిల్లా ఈపూరిపాలెం గ్రామానికి చెందిన దారబడి మార్క్ రూఫస్ దసరా సెలవులు కావడంతో వారి స్నేహితుడైన షేక్ సమీర్ వలి ఉండే గుండ్లపల్లి గ్రామానికి వచ్చారు. వీరు గుం టూరులోని లాం ఫాం వద్ద గల ఒక కళాశాలలో ఇంటర్మీ డియట్ బైపీసీ చదువుతున్నారు. గుండ్లపల్లికి వచ్చిన వీరు గ్రామానికి సమీపాన గల సాగర్ కుడికాలువలో ఈత కొట్టేం దుకు వెళ్లారు. ఈ క్రమంలో మార్క్ రూఫస్ (17), షేక్ హర్షద్ (17) కాలువలో దిగి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న నకరికల్లు ఎస్సై సతీష్ ఘటనా స్థలం వద్దకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

శబరి ఎక్స్‌ప్రెస్.. ఇకపై సూపర్ ఫాస్ట్.!

● నేటి నుంచి మారనున్న రైలు నంబర్లు ● 2 గంటల ప్రయాణ సమయం ఆదా ● ప్రయాణికులపై సూపర్ ఫాస్ట్ చార్జీల భారం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-త్రివేండ్రం మధ్య నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ ఇకపై సూపర్ ఫాస్ట్ రైలుగా మారనుంది. ప్రస్తుతం 17229/30 నంబర్లతో నడుస్తున్న రైలు ఇప్పటి నుంచి 20629/30 నంబర్లతో పరుగులు పెట్టనుంది. గతంతో పోల్చుకుంటే రైలు వేగం పెరగడంతో ఆ రైళ్లలో ప్రయాణించే వారికి సుమారు 2 గంటల ప్రయాణ సమయం ఆదా కానుంది. ఇప్పటివరకు సికింద్రాబాద్ నుంచి రోజూ మధ్యాహ్నం 12.20 గంటలకు బయల్దేరి మరుసటి సాయంత్రం 6.05 గంటలకు త్రివేండ్రంకు చేరుకునేది. తాజాగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారాక ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 6.25 గంటలకు చేరనుంది. అలాగే మునుపు త్రివేండ్రంలో ఉదయం 6.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45 గంటలకు సికింద్రాబాద్‌కు వచ్చే ఈ రైలు, ఇప్పుడు త్రివేండ్రంలో ఉదయం 6.45 గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు మరుసటి రోజు ఉదయం 11 గంటలకు చేరనుంది. శబరి ఎక్స్‌ప్రెస్ సూపర్ ఫాస్ట్ కావడంతో ప్రయాణికులపై చార్జీల భారం పడనుంది. ప్రయాణికులు జనరల్ సెకండ్ క్లాస్ టికెట్‌కు అదనంగా రూ.15, స్లీపర్ ఏసీ తరగతులకు రూ.30 నుంచి 40 వరకు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఇప్పటి వరకు దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో ఉండే ఈ రైలు నిర్వహణ బాధ్యతలను ఇప్పటి నుంచి సదరన్ రైల్వే చేపట్టనుందని రైల్వే ఉన్నతాధికారులు వెల్లడించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

25,839 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 26,167 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 25,839 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 4,715 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14200
నెంబరు. 5	10000	14300
273	10000	13600
341	10000	14700
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14600
షార్క్-1	-----	----
బ్యాడిగి	10000	15000
దేవనూరు డీలక్స్	10000	14000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9800	12000
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14400
నెంబరు. 5	10000	14000
273	----	----
341	10000	14800
4884	10000	13500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14700
బ్యాడిగి	10000	15000
దేవనూరు డీలక్స్	10500	14200
తాలుకాయలు	5000	7000

పల్నాడు వార్తలు



అమరలింగేశ్వరస్వామి దేవస్థానాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం


● వైసీపీ పాలనలో అక్రమ మద్యం తరలింపు ● అభివృద్ధి చేయకపోగా దేవాలయాన్ని నాశనం చేశారు ● ఎమ్మెల్యే యరపతినేని


దేవస్థానం వద్ద ఎమ్మెల్యే యరపతినేనికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ పూజారులు

గురజాలటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైద శ్రీఅమరలింగేశ్వరస్వామి దేవస్థానాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని దైద శ్రీఅమరలింగేశ్వరస్వామిని ఆయన దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరయ్యారు. పాలక మండలి సభ్యులతో దేవదాయ శాఖ ఈవో పూర్ణచంద్రరావు, దేవదాయ శాఖ చైర్మన్ వెంపటి సాంబశివరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఇదే వేదికపై పులిపాడు సొసైటీ చైర్మన్‌గా మద్దినేని వీరయ్య ప్రమాణ స్వీకారం చేశారు. పులిపాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా నాగెండ్ల లక్ష్మీనారాయణను ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ ఆలయాన్ని రాష్ట్రస్థాయిలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు వచ్చే అక్టోబరు నెలలో రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టూరిజం శాఖా మంత్రి కందుల దుర్గేష్, టూరిజం కమిషనర్, జిల్లా అధికారులు అమరలింగేశ్వరస్వామి ఆలయానికి వస్తున్నారన్నారు. గత వైసీపీ పాలనలో దేవాలయం సాక్షిగా వైసీపీ నాయకులు కృష్ణానది మీదుగా అక్రమ మద్యం తెచ్చుకొని వ్యాపారం చేసుకున్నారన్నారు. దేవాలయ అభివృద్ధికి రూ.100 కూడా ఖర్చు పెట్టలేదని, అభివృద్ధి చేయకపోగా నాశనం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడికాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, నేలవల్లి బొల్లయ్య, యాగంటి రామారావు, ఆకుల పిచ్చయ్య గుప్తా, అడపా శ్రీనివాసరావు, బడిదెల శ్రీనివాసరావు, మద్దినేని లక్ష్మీనారాయణ, ఐనాల నాగయ్య, భారీగా కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే కృష్ణ పుష్కరాలు

కృష్ణా పుష్కరాలు ఎప్పుడు జరిగినా ఆ సమయంలో టీడీపీ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే యరపతినేని అన్నారు. భగవంతుడికి కూడా కృష్ణా పుష్కరాలు చేసే అవకాశం ఎవరికి ఇవ్వాలో తెలుసన్నారు. వచ్చే పుష్కరాల సమయానికి దైద అమరలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద అతిథి గృహాలు ఏర్పాటు చేస్తామన్నారు.



మెప్మాలో పెరిగిన అవినీతి

● రూ.లక్షకు రూ.5వేలు వసూలు చేస్తున్నారు ●కౌన్సిలర్ల ఆరోపణ


కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి

సత్తెనపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలోని మెప్మా విభాగంలో అవినీతి పెరిగి పోయిందని పలువురు కౌన్సిలర్లు సోమవారం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆరోపించారు. సమావేశానికి చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసీ అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు కంభంపాటి అబ్రహం, సత్యవాణి, కూకుట్ల లక్ష్మీ, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు నాయక్‌లు మాట్లాడుతూ మెప్మా విభాగంలో పని చేసే ఆర్‌పీలు అవినీతికి పాల్పడుతున్నారని, రూ.లక్ష రుణానికి రూ.5 వేలు చొప్పున మామూళ్ళు వసూలు చేస్తున్నారని, ఇవ్వకుంటే ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మెప్మా విభాగంలో జరుగుతున్న అవినీతి పై పూర్తి స్థాయిలో విచారణ చేయటానికి ఆర్‌పీల పై చర్యలు తీసుకోవాలని కోరారు. దీని పై కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ కౌన్సిలర్ల ఆరోపణల పై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ మాట్లాడుతూ పట్టణంలోని అక్రమ నిర్మాణాలపై కౌన్సిల్‌లో తాము ప్రస్తావిస్తే సంబంధిత అధికారులతో కలసి రాజ్యాంగేతర శక్తి డబ్బులు వసూలు చేసుకుంటున్నాడన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన, జరుగుతున్న నిర్మాణాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఈ సమావేశంలో అచ్యుత శివ ప్రసాదు, షేక్ జానీ బాషా, ఆకుల రమేష్, లోకా మాధవి, గుజ్జర్లపూడి సతీష్, ఎస్ ఆనంద్, పెద్దింటి గోవిందమ్మ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో చర్చించాకే సమావేశం నిర్వహించుకుందాం

● మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్ ● సమావేశం వాయిదా


మున్సిపల్ సమావేశంలో చైర్మన్ మదార్‌సాహెబ్

మాచర్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అజెండాలోని అంశాలు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి లేకుండా చర్చించి ప్రయోజనమేమిటని, చర్చించాకే నిర్ణయం తీసుకుందామని 29వ వార్డు కౌన్సిలర్ షేక్ సుభాని సాహెబ్ అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే అజెండాలోని అంశాలపై చర్చ ప్రారంభించగానే కౌన్సిలర్ సుభాని అజెండాలోని అంశాలు ఆమోదం పొందాలంటే కౌన్సిలర్లు అందరూ నిర్ణయానికి రావాలని, ప్రస్తుతానికి వాయిదా వేసి తదుపరి సమావేశంలో చర్చించాకే నిర్ణయం తీసుకుందామని అన్నారు. దీంతో చైర్మన్ మదార్‌సాహెబ్ కౌన్సిల్ ఆమోదం మేరకే సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని, త్వరలోనే సమావేశం నిర్వహించే తేదీని ప్రకటిస్తామని సమాధానమిచ్చారు. దీంతో సభ్యులందరూ సమావేశం నుంచి నిష్క్రమించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు యర్రాకుల సిద్ధమ్మ సిద్ధయ్య యాదవ్, కలివెల జ్యోతి కిషోర్, కమిషనర్ వేణుబాబు, డీఈ సుభాని పాల్గొన్నారు.

బ్లాక్ బర్లీ పొగాకు పంటను సాగు చేయవద్దు : ఏవో


మాచర్ల రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హెచ్‌డి బ్లాక్ బర్లీ పొగాకును రైతులెవరూ సాగు చేయవద్దని ఏవో పాపకుమారి అన్నారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైట్ బార్లీ పొగాకును బ్రాండ్ ఉంటేనే సాగు చేయాలన్నారు. పొగాకుకు బదులు అపరాలు సాగు చేసుకోవాలన్నారు.

● అచ్చంపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు నల్లబర్లి పొగాకును సాగు చేయవద్దని మండల ప్రత్యేక అధికారి పీ మస్తానమ్మ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఏవో పీ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, డీసీ చైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

రెంటచింతల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేక మానసిక సమస్యలతో బాధపడుతున్న బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. బాలిక బహిర్భూమికి వెళ్లగా వి.నాగరాజు(23) అత్యాచారయత్నానికి పాల్పడగా బంధువులు కేకలు వేయటంతో పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రులు రెంటచింతల స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జున చెప్పారు.





జల దిగ్బంధంలో లంకలు

● ముంచెత్తుతున్న కృష్ణమ్మ ● రోడ్లపైకి నీరు చేరటంతో దారులు మూత ● ఇళ్లలోకి వరద నీరు... లోతట్టు గ్రామాల నుంచి సురక్షిత ప్రాంతాలకు

ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక



మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయ మండపంలో చేరిన వరద నీరు



పెనుమూడిలో పునరావాస కేంద్రాల్లో ఉన్న పల్లెపాలెం వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రేపల్లె, తెనాలి, కొల్లూరు, కొల్లిపర, దుగ్గిరాల, సెప్టెంబరు 29, (ఆంధ్రజ్యోతి): వరద ముంపు లంక గ్రామాల వాసులను భయభ్రాంతులకు గురిచేసింది. ప్రకాశం బ్యారేజీకి ఇన్‌ఫ్లో 6,61,960 క్యూసెక్కుల వరద నీరు ఎగువ నుంచి వచ్చి చేరుతుంటే, వాటిలో కృష్ణా డెల్టా కాల్వలకు వదలగా మిగిలిన 6,46,821 క్యూసెక్కుల వరద నీటిని మాత్రం సముద్రంలోకి వదిలేస్తున్నారు. అయితే ఎగువ జలాశయాల నుంచి వస్తున్న వరదకు తోడు, బ్యారేజి క్యాచ్‌మెంట్ ప్రాంతం నుంచి వస్తున్న వరద కూడా ఎక్కువగా ఉండటంతో ముంపు సమస్య తీవ్రమవుతోంది. దీనికితోడు సముద్రంలో పోటు కూడా సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉండటంతో నదిలో వరద నీరు ఎదురు తన్నటంతో అటు పెనుమూడి ప్రాంతంలో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. సాయంత్రం నుంచి ఆటు ఏర్పడటంతో కాస్తంత తగ్గుముఖం పట్టినట్టయింది. అయితే మరో మూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని, ప్రవాహంలో హెచ్చుతగ్గులు ఉంటాయని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

లంక గ్రామాలకు రాకపోకలు బంద్!

ప్రకాశం బ్యారేజి దిగువన గుంటూరు జిల్లాలో తీర గ్రామాలకు పెద్దగా ఇబ్బంది లేకున్నా, నది మధ్యలో ఉన్న కొల్లిపర మండలం కొత్తూరులంక, అన్నవరపు లంక గ్రామాలకు బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని అరవింద వారధి నుంచి వెళ్లాల్సి ఉండటం తో సుగ్గునలంక దగ్గర చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. వీటికి అనుకుని ఉన్న కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలానికి చెందిన కనిగిరిలంక గ్రామానికీ రాకపోకలు లేకుండా పోయాయి. అటు బాటప్ల జిల్లాలోని కొల్లూరు మండలంలో నది మధ్యనున్న 11 లంక గ్రామాలకు రవాణా పూర్తిగా నిలిచిపోయింది. మరోపక్క కరకట్ట నుంచి లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపైకి కూడా నీరు పొంగిపొర్లే పరిస్థితి ఉండటంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. గాజుల్లంకకు వెళ్లే రోడ్డుపైనా వరద నీరు ప్రవహిస్తోంది. గాజుల్లంక-పోతార్లంక మధ్య రోడ్డుపై కూడా వరద ఉధృతి పెరగటంతో ఆ మార్గంలోనూ రాకపోకలు నిలిచిపోయాయి. దోనేపూడి-పోతార్లంక మధ్య చిన్నరేవు చప్టాపైకి వరద నీరు చేరటంతో పడవలపై వెళ్లాల్సిన పరిస్థితి. భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం దగ్గర చిన్నరేవు ఉధృతంగా ఉండటం, గ్రామంలోని లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇళ్లలోకి వరద నీరు క్రమంగా చేరుతుండటంతో ముంపు సమస్య ఉన్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

'ముదినేపల్లి' నుంచే భారీ వరద

కృష్ణా నది ఎగువ జలాశయాల నుంచి వస్తున్న వరద కంటే బ్యారేజి క్యాచ్‌మెంట్ ప్రాంతం నుంచి వస్తున్నదే ఎక్కువగా ఉంది. ప్రకాశం బ్యారేజికి సోమవారం ముదినేపల్లి వాగు నుంచి 5,57,816 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంటే, పాలేరు నుంచి 26,804 క్యూసెక్కులు, కీసర నుంచి 21,284 క్యూసెక్కుల వరద దిగువకు వస్తోంది. సోమవారం ఉదయం 6 గంటలకు 6,86,074 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజికి చేరితే, అది మధ్యాహ్నానికి 6,81,383 క్యూసెక్కులకు తగ్గింది. సాయంత్రానికి 6,61,960 క్యూసెక్కులు తగ్గింది. వీటిలో కృష్ణా డెల్టా కాల్వలకు 15,139 క్యూసెక్కులు వదులుతున్నారు. కేఈ మెయిన్ కెనాల్‌కు 8,617 క్యూసెక్కులు, కె.డబ్ల్యు మెయిన్ కెనాల్‌లకు 6,522 క్యూసెక్కులు వదులుతున్నారు. నదిలోకి మాత్రం 6,46,821 క్యూసెక్కుల వరద నీటిని వదిలేస్తున్నారు. బ్యారేజి నీటి మట్టం అత్యధిక స్థాయిలో ఉంది. 13 అడుగుల సామర్థ్యం ఉన్న బ్యారేజి దగ్గర సోమవారం ఉదయం 16.4 అడుగుల మేర నీటి మట్టం ఉంటే, సాయంత్రానికి క్రమంగా తగ్గుతూ 16 అడుగులకు చేరింది. తగ్గుదల అయితే కేవలం 4 అంగుళాలే తగ్గినట్టయింది. హెచ్చుతగ్గులున్నా, భారీస్థాయిలో ఉండకపోవచ్చని, నిలకడగా వరద కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.



కొల్లూరు : వరద నీటిలో మునిగిపోయిన అరటి తోట



కొల్లూరు : వరద నీటిలో కూరగాయ పంటలు

9 నెలల గర్భిణి, మరో 11 మంది సురక్షిత ప్రాంతానికి తరలింపు

కొల్లిపర మండలం అన్నవరపు లంకలో చిక్కుకున్న పందిపాటి సౌజన్య 9వ నెల గర్భిణి కావటం, వరద ఉధృతి పెరుగుతుందన్న భయంతో అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన కొల్లిపర ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ గోపాలకృష్ణ ప్రత్యేకంగా పడవ ఏర్పాటుచేసి, ఆమెను అన్నవరపులంక నుంచి బొమ్మువానిపాలెం తరలించారు. ఆమెతోపాటే నరసరావుపేటకు చెందిన మరో 11 మంది కూడా అదే గ్రామంలో చిక్కుకున్నామని సమాచారం ఇవ్వటంత వారినికూడా పడవలో సురక్షిత ప్రాంతానికి తరలించారు. మరోపక్క బాపట్ల జిల్లా వెల్లటూరు దగ్గర చిన్నరేవు దాటే ప్రయత్నంలో తిప్పకలట్టకు చెందిన తండ్రి, కుమారుడు ప్రమాదవశాత్తు జారి నీటిలో పడిపోవటం, కొట్టుకుపోతున్న తరుణంలో స్థానికులు అప్రమత్తమయి కొందరు యువకులు నీటిలో దూకి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు అర్ధగంటసేపు ఉత్కంఠత మధ్య చివరకు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉంటే... వరద ముందస్తు జాగ్రత్తల నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని, లోతట్టు ప్రాంతాల నుంచి ఏ సమయంలోనయినా జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెనాలి సబ్‌కలెక్టర్ సంజన సింహ చెప్పారు. నది మధ్య ఉన్న లంక గ్రామాల్లో ఉన్నవారికి అవసరమైన అత్యవసర సరకులు కూడా సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ఎవరైనా ఏ ఇబ్బంది ఉందని సమాచారం అందించినా వెంటనే వారికి సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగాఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.



రావిఅనంతవరం సమీపంలో కృష్ణానదికి ఆనుకుని ఉన్న రొయ్యల చెరువుకు గండిపడటంతో ఉధృతంగా వస్తున్న వరదనీరు

వదంతులను నమ్మవద్దు

మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలోని కృష్ణానదికి వరద పోటెత్తటంతో రేపల్లె,వేమూరునియోజకవర్గాల్లోని లంకగ్రామాల ప్రజలు కరకట్టవెంబడి ఉన్న గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగానిసత్యప్రసాద్ పేర్కొన్నారు. ప్రకాశంబ్యారేజీకి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్,కృష్ణారివర్‌అథారిటీ అధికారులుసమన్వయంతో పనిచేస్తూ కరకట్టకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీచేశారు. కృష్ణానది పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలు,కాల్వలు, నదిని దాటే ప్రయత్నం చెయ్యవద్దని ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. సోషల్‌మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని ఎటువంటి విపత్తునైన ఎదుర్కొనేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు.

అండగా నిలుస్తాం : కలెక్టర్

కృష్ణా నదికి వరదపోటెత్తటంతో కరకట్టవెంబడిఉన్న భట్టిప్రోలుమండలం పల్లెపాలెం, రేపల్లెమండలం పల్లెపాలెం, ఘైనేనివారిపాలెం, లంకెవానిదిబ్బ గ్రామాల్లోని ప్రజలు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో ఉండాలని జిల్లాకలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం వరద ముంపు గ్రామాలను ఆయన పరిశీలించారు. పెనుమూడిలో పల్లెపాలెం పూర్తిగా నీటమునగటంతో పునరావసకేంద్రాల్లో ఉన్న బాధితులను పరామర్శించి ధైర్యంచెప్పారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆహార పానీయాలు, విద్యుత్, ఫ్యాన్‌లను ఏర్పాటు చెయ్యాలని రెవెన్యూఅధికారులకు సూచించారు. ప్రత్యేకంగా మెడికల్‌క్యాంప్ ఏర్పాటుచేసి బాధితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని అవసరమైనవారికి తగిన మందులు అందించాలని సూచించారు.

హోరాహోరీగా జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు



చెస్ ఆడుతున్న క్రీడాకారులు

గుంటూరు (విద్య), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. సోమవారం జరిగిన ఎనిమిదో రౌండ్‌లో నాలుగుసార్లు జాతీయ చాంపియన్ పీఎస్‌పీ బీకి చెందిన జీఎం కృష్ణన్ శశికిరణ్ తన జట్టుకే చెందిన సహచరుడు జీఎం.దీప్‌సేన్ గుప్తాపై గెలుపొందాడు. అదే జట్టుకు చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ అభిజిత్ గుప్తా యూపీకి చెందిన ఐఎం ఎలెక్ట్ అజయ్ సంతోష్ పర్వత్‌రెడ్డిపై విజయం సాధించాడు. దీంతో శశికిరణ్, అభిజిత్ చెరో 7 పాయింట్లతో టాప్‌లో నిలిచారు. వీరికి సగం పాయింట్ల వెనుక ఆరుగురు ఆటగాళ్లు ఉన్నారు.

ఏపీ కాటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు కొర్రపాటి రామారావు

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాటన్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎన్నికైంది. 2025-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా కొర్రపాటి రామారావు, గౌరవాధ్యక్షుడిగా పెరవలి రాఘవరావు, ఉపాధ్యక్షులుగా పి.వీర నారాయణ, డీఎల్ఎస్ ప్రసాదు, గౌరవ కార్యదర్శిగా ఎం.సురేంద్రబాబు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.రంగారావు, ఎన్.సుబ్బా రావు, గౌరవ కోశాధికారిగా ఎన్.సూర్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కాటన్ వ్యాపారస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామి ఇచ్చారు.

సరిహద్దులు లేని సంస్థ సంగం డెయిరీ

● రూ. 2,019 కోట్లకు చేరిన టర్నోవర్ ● డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సరిహద్దులు లేని సంస్థగా సంగం డెయిరీని విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. వడ్లమూడి సంగం డెయిరీ అవరణలో సోమవారం సంగం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో సంగం డెయిరీతో పాటు డీవీసీ ఆసుపత్రి వార్షిక ప్రగతి నివేదికను ప్రవేశపెట్టి సభ్యుల ఆమోదంతో తీర్మానం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో చైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, తాను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయంలో 45 వేల లీటర్ల పాల సేకరణ మాత్రమే జరిగేదని, కాని నేడు సమిష్టి కృషితో రోజుకు 10 లక్షల లీటర్లకుపైగా పాల సేకరణ చేపట్టేలా పాలకవర్గం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ ఏడాది సంగం డెయిరీ 2,019 కోట్ల టర్నోవర్ సాధించిందని.. వచ్చే ఏడాది 2,300 కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. గడిచిన ఏడాది రైతులకు బోనస్ పంచగా రూ. 12.79 కోట్ల నికర లాభం అర్జించినట్లు తెలిపారు. కంపెనీ విస్తరణలో భాగంగా నూతన పాల శీతలీకరణ కేంద్రాల ఏర్పాటు, నాయుడుపేటలో నూతన డెయిరీ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో రోజుకు లక్షన్నర లీటర్ల పాల సేకరణ చేపట్టి హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నూతన ఉత్పత్తులను రూపొందిస్తున్నామని, అందులో భాగంగా షుగర్ ఫ్రీ ఉత్పత్తులను రూపొందించి మార్కెట్లోకి ప్రవేశపెడుతున్నామని చెప్పారు. రైతులకు సౌలభ్యం కోసం ఫార్మర్ యాప్ అమలు చేయనున్నట్లు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆవు నెయ్యి సరఫరా కాంట్రాక్టు దక్కడం సంగం డెయిరీకి లభించిన అదృష్టమని నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా టెన్నిస్ క్రీడాకారిణి నలుగుదుటి అనూషకు రూ. 5 లక్షల ప్రోత్సాహక నగదును చైర్మన్ నరేంద్ర కుమార్ అందజేశారు. అనంతరం అత్యధిక పాలు పోసిన రాష్ట్రంలోని పలువురు రైతులను ఘనంగా సత్కరించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ ఎండీ పి. గోపాలకృష్ణ, డీవీసీ ఆసుపత్రి ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

కనక దుర్గమ్మకు 108 వీణలతో సంగీతార్చన



108 వీణలతో సంగీతార్చన చేస్తున్న మహిళలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెనాలి చెంచుపేటలో అమ్మవారికి 108 వీణలతో సంగీతార్చన చేశారు. చెంచుపేట పద్మావతి కళ్యాణ మండపంలో శ్రీ విద్యా పీఠం ఆధ్వర్యంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. సాలిగ్రామ మఠం, జయలక్ష్మి నాట్యమండలి ఆధ్వర్యంలో 108 మంది మహిళా భక్తులు ఒకే రమమైన దుస్తులు ధరించి బాలస్వామితో అమ్మవారిని స్తుతిస్తూ పలు కీర్తనలు ఆలపించారు. రెండు గంటల పాటు వీణపై ఆలపించిన భక్తి గీతాలు భక్తులకు వీనుల విందు చేశాయి. నంబూరు వెంకటకృష్ణమూర్తి, కొత్త సుబ్రహ్మణ్యం, రావూరి సుబ్బారావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, మురళీ మనోహర్, రామకృష్ణ, రాజేశ్వరరావు, ముద్దా భక్తుని రమణయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వినుకొండ కీర్తిని ఇనుమడింపజేసిన జాషువా

- జ్ఞాపకార్థం డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు: చీఫ్‌విప్ జీవీ
- ఘనంగా విశ్వకవి 130వ జయంతి వేడుకలు




పెనుగొండ లక్ష్మీనారాయణ, నల్ల వెంకటేశ్వరరావుకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న చీఫ్‌విప్ జీవీ, మక్కెన

వినుకొండ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తన కవిత్వంతో.. సమాజంలోని అసమానతలను ఎత్తుచూపుతూ.. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో నిప్పు కణికలాగా గుర్రం జాషువా ఉద్భవించాడని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. వినుకొండలో పుట్టి జాషువా అంటరానితనం, పేదరికాన్ని తన గురువులుగా ఎంచుకొని.. గబ్బిలాన్ని కదా వస్తువుగా ఎంచుకొని కవిత్వంలో విజయవతం అయ్యారన్నారు. నరసరావుపేట రోడ్డులోని జాషువా కళా ప్రాంగణంలో జాషువా సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు చిలకల జాన్ సుందరరావు అధ్యక్షతన గుర్రం జాషువా 130వ జయంతి ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ.. జాషువా దేశవిదేశాల్లో వినుకొండ కీర్తిని ఇనుమడింపజేశారన్నారు. ఆయన జ్ఞాపకంగా వినుకొండలో ఎన్ఎస్‌పీ కాలనీ ఆవరణలో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఖాసిం మాట్లాడుతూ.. వినుకొండలో.. 'ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారట నలుగురు కుమారులు. మరి పంచమ జాతి పుట్టుటకు మూలమేమిటి?' అని జాషువా ప్రశ్నిస్తే ఈ రోజుకి సమాధానం చెప్పిన వారు లేరన్నారు. జాషువా 130వ జయంతి వేడుకల సందర్భంగా కళా ప్రాంగణంలో ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన పద్య, కవిత్వం పోటీల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు బహుమతులు ప్రదానం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రముఖ రంగస్థలం కళాకారుడు నల్ల వెంకటేశ్వరరావుకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షకీలా, సమైక్య కార్యదర్శి రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, న్యాయవాదులు సీహెచ్ మూర్తి, విజయ్, జి.కమలారం, భాగవతుల రవికుమార్, ప్రదీప్, పిడుగు విజయ్, దేవ, లగడపాటి వెంకట్రావు, హనుమంత రెడ్డి, బొంకూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా రచన నాటక ప్రదర్శనలు

జీవన్‌జ్యోతి స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో గుర్రం జాషువా రచించిన శ్మశాన వాటిక, గబ్బిలం, ముంతాజ్‌మహల్, పిరదౌసి ఘట్టాలను పద్యనాటకాల ద్వారా కళాకారులు బస్టాండ్ సెంటర్‌లో ప్రదర్శించారు. ఈ పద్య నాటకాలు పట్టణ వాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చీఫ్‌విప్ జీవీ, జీడీసీసీబీ చైర్మన్ పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మందా వెంకట్రావు, బీజేపీ జిల్లా కార్యదర్శి కట్టాసుబ్బారావు, పి.వి.సురేష్, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

26 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



విజయపురిసౌత్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు సోమవారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 585.30 అడుగులు ఉంది. ఇది 298.30 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9533 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5800 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,414 క్యూసెక్కులు, 24 క్రస్ట్‌గేట్లను 15 అడుగులు, 2 క్రస్ట్ గేట్లను 20 అడుగులు మేర ఎత్తి 5,41,516 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 5,91,463 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 5,91,463 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

సత్రశాలలో 18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

రెంటచింతల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తోంది. దాంతో ప్రాజెక్టు 18 క్రస్ట్ గేట్లను ఎత్తి 5,88,988 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఎగువన ఉన్న సాగర్ నుంచి 5,74,240 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. రిజర్వాయర్‌లో 73.10 మీటర్ల మేర నీరుదని ఇది 5.543 టీఎంసీలకు సమానమని ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, గిరిబాబు తెలిపారు. వరద నీరు భారీగా వస్తుండడంతో ప్రాజెక్టులో విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపివేసినట్లు చెప్పారు. కాగా, సత్రశాల ఆలయం సమీపంలో వరద నీరు ఉగ్రరూపం దాల్చడంతో విద్యుత్ స్తంభాలు నీట మునిగాయి. దాంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 37.99 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 5,92,400 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోందని ఆయన చెప్పారు. ప్రాజెక్టు వద్ద 16 గేట్లను ఐదు మీటర్ల మేర ఎత్తి 5,68,511 క్యూసెక్కులు, లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం 5,68,911 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ రాజు తెలిపారు.

పశ్చిమడెల్టాకు 5,924 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారే జి నుంచి పశ్చిమడెల్టాకు సోమవారం 5,924 క్యూసెక్కుల నీటిని విడు దల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 16.2 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 6,61,960 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హై లెవెల్ చానల్‌కు 230 క్యూసెక్కులు, రేపల్లెకా ల్వకు 1,513 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 502 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 190 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 335 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2,880 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.


దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

స్థానిక పసుపు మార్కె ట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 569 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,450, గరిష్ఠ ధర రూ.10,375, మోడల్ ధర రూ.10,300 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,450, గరిష్ఠ ధర రూ.10,300, మోడల్ ధర రూ.10,300 పలికాయి.

ప్రకాశం బ్యారేజీ వద్ద స్థిరంగా వరద ఉధృతి

● దిగువకు 6,46,821 క్యూసెక్కుల నీటి విడుదల ● కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 6,61,960 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదయినట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 16 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 6,46,821 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టా కాలువకు 8,617 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 6,522 క్యూసెక్కులు వదలగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదలను నిలిపేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని దిగువ నది తీర ప్రాంత వాసులు, లంక భూముల రైతులు మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



దిగువకు విడుదలవుతున్న వరద నీరు

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

వినుకొండ టౌన్ సెప్టెంబరు 29, (ఆంధ్రజ్యోతి): స్థానిక జాషువా కళా ప్రాంగణంలో మున్సిపల్ కార్మికులకు గ్రామీణ బ్యాంక్ సౌజన్యంతో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా రమేష్ హాస్పిటల్, యూరో, కిడ్నీ సెంటర్ సహకారంతో మున్సిపల్ కార్మికులకు, ఇంజనీరింగ్ సిబ్బందికి సోమవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షకీలా బేగం, మున్సిల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, వినుకొండ బ్యాంక్ అధికారులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్, శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూసి ఉన్న వైద్యుని గది

పీహెచ్‌సీల్లో ఓపీ నిలిపివేత

శావల్యాపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారుల డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరవధిక సమ్మె నాల్గోరోజుకు చేరింది. శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు సోమవారం ఓపీ సేవలు నిలిపివేశారు. దీంతో రోగులు పీహెచ్‌సీకి వచ్చి నిరాశగా వెనుదిరిగారు. వైద్యాధికారులు సమ్మెబాట పట్టడంతో రోగులకు వైద్యసేవలు అందడం లేదు. డాక్టర్ రమ్య మాట్లాడుతూ ప్రభుత్వం డిమాండ్‌లు పరిష్కరించకపోతే డీఎంహెచ్‌వో కార్యాలయాలు, విజయవాడల్లో ధర్నా చేస్తామన్నారు.

● రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఓపీ సేవలు సోమవారం నిలిచిపోయాయి. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు జగన్‌మోహన్‌రెడ్డి, నిమ్మల సాయిబాబు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన విఠంరాజుపల్లి సమీపంలోని చెక్‌పోస్టు వద్ద సోమవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పిడుగురాళ్లలో ఓ శుభకార్యాన్ని ముగించుకొని మార్కాపురం వెళ్తున్న కారు, శ్రీశైలం సమీపంలోని సుండిపెంట నుంచి పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట వెళ్తున్న జీపుకు వెనుక కట్టుకొని తరలిస్తున్న మరో జీపును ఢీకొట్టడంతో జీపు పల్టీకొట్టింది. జీపులో ఉన్న బాషా, కిషోర్‌లకు గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న మజ్జారి వీరాంజనేయులుకు స్వల్పగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన కిషోర్‌ను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. జరిగిన ప్రమాదంపై పోలీసులను అడుగగా ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

జీఎస్టీ ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ

నూజెండ్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై మండలంలోని జంగాలపల్లిలో సోమవారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్టీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వస్తువుల కొనుగోలులో జీఎస్టీని తగ్గించిన రేట్లనే వినియోగదారులకు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే రబ్బానీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాత, కొత్త ధరలను ప్రదర్శించాలి

నాదెండ్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ-2 సంస్కరణల ప్రజలకు అవగాహన కల్పించేందుకు షాపుల ఎదుట పాత, కొత్త ధరలను ప్రదర్శించాలని సత్తెనపల్లి జీఎస్టీ కార్యాలయ నోడల్ అధికారి సునీల్ బాబు, కార్యదర్శి మారుతీబాబు అన్నారు. మండలంలోని గణపవరం గ్రామంలో జీఎస్టీ సంస్కరణలకు సంబంధించి గోడ పత్రికను పలు షాపుల యజమానులకు అందజేశారు. కాగా తమ సమస్యలను పరిష్కరించాలంటూ సచివాలయ ఉద్యోగులు కార్యక్రమాన్ని బహిష్కరించారు.

● చిలకలూరిపేట: పల్నాడు జిల్లా వినియోగదారుల సంఘం వారు రూపొందించిన జీఎస్టీ పోస్టర్‌ను సోమవారం తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ తగ్గించి వినియోగదారులకు అనేక వస్తువులు తక్కువ ధరలకే లభ్యమయ్యేలా చేశారన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కొత్త జీఎస్టీ వివరాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కన్స్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎం.ప్రసాద్, రవి నాయక్, విక్రమ్, విద్యాసాగర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

● మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ, స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలోని 29, 30 వార్డులో (ఏనుగుల బజారు) బాలురకు మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని కమిషనర్ ఎం.జస్వంతరావు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు పర్యావరణ కార్యదర్శులు, మెప్మా ఆర్పీలు, సీనియర్ సిటిజన్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నరసరావుపేట వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతిదేవి అలంకారం



శావల్యాపురం: గంటవారిపాలెంలో సరస్వతీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ

సరస్వతి నమస్తుభ్యం

పలు దేవాలయాల్లో దసరా ఉత్సవాల సందర్భంగా మూలనక్షత్రంను పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాల్లో అమ్మవారికి సరస్వతి అలంకారం చేశారు. విద్యార్థులు సరస్వతీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించారు. అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాలు జరిగాయి.- ఆంధ్రజ్యోతి





సరస్వతిదేవి అలంకారంలో రొంపిచర్ల వాసవి అమ్మవారు, విప్పర్లలో కామాక్షి అమ్మవారు







బొల్లాపల్లి మండలం రేమిడిచర్లలో, నాదెండ్లలో, సొలస బ్రహ్మంగారి ఆలయంలో సరస్వతి అలంకారం



కొబ్బరి బోండాల అలంకరణలో వినుకొండ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

● కలెక్టర్ కృతికా శుక్లా



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా 125 అర్జీలు అందాయి. అర్జీలను జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాతో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్‌పై కరపత్రాల ఆవిష్కరణ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృతికా శుక్లా మాట్లాడుతూ జీఎస్‌టీ తగ్గింపువలన పలు వర్గాల ప్రజలకు చేకూరుతున్న లబ్ధిపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు 95ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 29, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్

నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం తదితర సమస్యలకు సంబంధించి 95 ఫిర్యాదులు అందాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నరసరావుపేట మండలం కాకానికి చెందిన నిడమానూరు వెంకట్రావు వద్ద ఏ శివారెడ్డి, నాగలక్ష్మి, పుల్లారెడ్డి, వెంకటేశ్వరరెడ్డిలు 1.10 సెంట్ల భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ సమయంలో తనకు తెలియకుండా అదనంగా 36 సెంట్లు రాయించుకొని రిజిస్ట్రేషన్ చేయించుకొని మోసం చేశారని ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. నరసరావుపేటలోని బరంపేటకు చెందిన టి.చంద్రశేఖర్ మరొక 400మంది వద్ద చరిష్మా లక్కీ స్కీమ్ పేరుతో ఏలూరు స్రవంతి, ఏలూరు నాగేశ్వరరావు, ఏలూరు నరేంద్ర, బాలులు ఒకొక్కరి వద్ద రూ.72000 కట్టించుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ పాల్గొన్నారు.



రామచంద్ర ఫర్నీచర్స్, సూరపనేని ఐకాన్ బిల్డింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

ఘనంగా 'రామచంద్ర ఫర్నీచర్స్' ప్రారంభం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్డులో నూతనంగా నిర్మించిన సూరపనేని ఐకాన్ వాణిజ్య భవనంలో రామచంద్ర బ్రదర్స్ మెగా ఫర్నీచర్ షోరూమ్ సోమవారం ఘనంగా ప్రారంభించారు. నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ఈ షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచంద్రా బ్రదర్స్ ఫర్నీచర్ షోరూమ్ నిర్వాహకులు పీ సుబ్బారావు మాట్లాడుతూ పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో వినియోగదారులకు ఎన్నో రకాల ఫర్నీచర్‌ను అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా కొనుగోలుదారులకు ప్రత్యేక రాయితీలు అందిస్తున్నామని చెప్పారు. సూరపనేని ఐకాన్ బిల్డింగ్ అధినేత సూరపనేని శ్రీహరి మాట్లాడుతూ నరసరావుపేట పట్టణం వ్యాపార సంస్థలకు అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు నల్లపాటి రామచంద్రప్రసాద్, వేములపల్లి వెంకటనరసయ్య, గొట్టిపాటి చౌదరిబాబు, ఆళ్ళ శివ, చింతా రామకృష్ణ, చాంబర్ అధ్యక్షుడు వనమా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు సాగు చేయవద్దని రైతులకు అవగాహన

చిలకలూరిపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం రామచంద్రపురం గ్రామంలో సోమవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారిణి సీహెచ్ సరిత మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశం మేరకు ఈ ఏడాది రైతులెవ్వరూ నల్లబర్లీ పొగాకు సాగు చేయవద్దని ఈ సందర్భంగా రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రత్యామ్నాయ పంటలైన కంది, మినుము, పెసలు, శనగ, చిరుధాన్యాల వైపు మొగ్గు చూపాలని సూచించారు. నల్లబర్లీ పొగాకు సాగుచేస్తే పంట ఏ దశలో ఉన్నా దున్నివేయటం జరుగుతుందన్నారు. వారిపై చట్టరీత్యా చర్యలు కూడా తీసుకోనున్నట్లు తెలిపారు. జీఎస్టీ తగ్గింపుతో ట్రాక్టర్లు, బయో పురుగుమందులు, సూక్ష్మ పోషకాలపై, స్ప్రింక్లర్లు, బిందు సేద్యం, కంపోస్ట్ యంత్రాల ధరలు తగ్గిన విషయం రైతులు గమనించాలని కోరారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.ప్రవీణ్ పాల్గొన్నారు.

3 నుంచి పెద్ద కంచర్లలో రీ సర్వే

వినుకొండ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వేను అక్టోబరు 3వ తేదీ నుంచి మండలంలోని పెద్ద కంచర్లలో చేపట్టనున్నట్లు తహసీల్దార్ సురేష్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి సర్వేపై సమావేశం నిర్వహించి అధికారులకు సహాయ సహకారాలు అందించి, భూమి కొలతలు సరి చూసుకోవాలన్నారు.

పలు పాఠశాలల్లో ఘనంగా అక్షరాభ్యాసం

చిలకలూరిపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి పుట్టినరోజు మూలానక్షత్రం సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చైతన్య ఎలీట్ పాఠశాలలో పాఠశాల డైరెక్టర్ ఈవీ గిరీష్ బాబు కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొని, గాయత్రీహోమం నిర్వహించి వేద పండితులతో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. మోడరన్ స్టెల్లార్ స్కూలులో సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బాసర నుంచి తెప్పించిన పలకలు, బలపాలు, పుస్తకాలు, పెన్నులు, అక్షింతలు, ప్రసాదం తల్లిదండ్రులకు అందచేశారు. జీవీఐటీ పాఠశాలలో సరస్వతి పూజ, సామూహిక అక్షరాభ్యాస వేడుకలు నిర్వహించారు. సుబ్బయ్య తోటలోని వికాస్ విద్యాసంస్థలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ డైరెక్టర్లు దండా పవన్ కుమార్, దండా రోజశ్రీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రొంపిచర్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిచెట్టుపాలెం గ్రామానికి చెందిన వరికూటి రవీంద్ర (38) మూడు రోజుల క్రితం కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుమందు తాగారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు. అతని తల్లి కొండమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఎస్సీ సబ్ ప్లాన్‌తో కాలనీలు అభివృద్ధి చెందాయి

● మార్కెట్ యార్డు చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్

నూజెండ్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో ఎస్సీ కాలనీల అభివృద్ధికి, సంక్షేమానికి నిధులు వెచ్చించటానికి కృషిచేసిందని వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ అన్నారు. మండలంలోని తలార్లపల్లిలో అధికారులు సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ పౌరులందరూ సోదర భావంతో వ్యవహరించాలని, పౌర హక్కులకు భంగం కలగకుండా రాజ్యాంగాన్ని, చట్టాలను గౌరవించాలన్నారు. హక్కులకు భంగం కలిగితే ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మోతడక వీరాచారి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్ఐ సైదా, వీఆర్వోలు వెంకటరమణ, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్‌లను పరిష్కరించాలి

● ఇన్‌చార్జి ఎంపీడీవోకు సచివాలయ ఉద్యోగుల వినతి

శావల్యాపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి వెంటనే పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరుతూ మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లోని ఉద్యోగులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుగుణను సోమవారం కలసి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో పింఛన్‌దారులకు పంపిణీ చేయాల్సిన నగదును సోమవారం తీసుకోగానే సచివాలయ ఉద్యోగులంతా ప్రభుత్వ అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలుగుతామన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో వైదొలగినప్పటికీ సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. అక్టోబరు నెల పింఛన్‌లు కూడా యథాతథంగా అందజేస్తామన్నారు.



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైసీపీ జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

కార్యకర్తలకు శ్రీరామరక్ష డిజిటల్ బుక్

● వైసీపీ జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ శ్రీరామరక్ష అని వైసీపీ జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక గుంటూరు రోడ్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ యాప్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరణ చేసినట్లు తెలిపారు. నరసరావుపేట నియోజకవర్గంలో ఇబ్బందిపడిన ప్రతి కార్యకర్త ఈ డిజిటల్ బుక్‌లో తాము ఎదుర్కొన్న ఇబ్బందులను నమోదు చేయాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి పార్టీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన ఎవరినీ వదిలిపెట్టకుండా ప్రతి ఒక్కరిని చట్టం ముందు నిలబెడతామని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

గుండె జబ్బులపై అవగాహన సదస్సు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐఎంఏ హాల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా గుండె జబ్బులపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, తినే ఆహారం వలన అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ శేషగిరిరావు, పట్టణానికి చెందిన గుండె వైద్య నిపుణులు డాక్టర్ శాఖమూరి బాజీబాబు, డాక్టర్ చింతకుంట శిరీష, డాక్టర్ కూలిశెట్టి గౌతం, పరమేశ్వర్‌రెడ్డి, రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే పట్టణం లోని మహాత్మా గాంధీ వైద్యశాలలో కూడా డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి గుండె ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం సీఎం సహాయ నిధి కింద 17 మంది లబ్ధిదారులకు రూ.18,98,418లు విలువైన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, లబ్ధిదారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లేశ్వరుని దర్శించుకున్న నరసరావుపేట ఎమ్మెల్యే

పెదకాకాని, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం దర్శించారు. ఆలయంలో ప్రదక్షణ చేసి, మల్లేశ్వర స్వామివారికి, భ్రమరాంబ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శేష వస్త్రాలతో ఎమ్మెల్యే దంపతులను ఆలయ అర్చకులు సత్కరించి, స్వామివారి చిత్రపటాలను అందజేశారు.



చిలకలూరిపేటలో ఆర్వో ప్లాంటును తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు

ఆర్వో ప్లాంట్లలో మున్సిపల్ కమిషనరు తనిఖీ

చిలకలూరిపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్వో ప్లాంట్‌లను మున్సిపల్ కమిషనర్ పీ శ్రీహరిబాబు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్వో ప్లాంట్‌ల నిర్వాహకులతో మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో డయేరియా కేసులు, గుంటూరులోని ఆర్వో ప్లాంట్ లలో క్లెబ్సియెల్లా బ్యాక్టీరియా గుర్తించినట్లు చెప్పారు. చిలకలూరిపేటలోని ఆర్వో ప్లాంట్‌ల వారు ముందు జాగ్రత్తచర్యగా తమ ప్లాంట్ లలోని నీటిని సేకరించి గుంటూరు రీజినల్ ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకుని రెండు రోజుల లోపు మునిసిపల్ కార్యాలయంలో అందచేయాలని ఆదేశించారు. లేకుంటే ఆర్వో ప్లాంట్‌లను మూసివేయనున్నట్లు హెచ్చరించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా యాకోబు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన యాకోబు

శావల్యాపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎఫ్ఏసీ డిప్యూటీ ఎంపీడీవోగా బొడ్డు యాకోబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం శావల్యాపురం పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సీతారామయ్య శిక్షణ తరగతులకు వెళ్ళగా ఆయన స్థానంలో డిప్యూటీ ఎంపీడీవోగా ఉన్న పొట్టిపాలెం సుగుణను ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. కానీ సుగుణకు ఎంపీడీవోగా ప్రభుత్వం పదోన్నతి కల్పించడంతో ఆమె త్వరలో బదిలీ కానున్నారు. అనంతరం స్వచ్ఛతా-హీ-సేవ కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీ చిత్రపటానికి యాకోబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామసచివాలయం వద్ద పరిసరాలు శుభ్రం చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ దివ్యభారతి, కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మీట్ అండ్ గ్రీట్‌లో డాక్టర్ కోడెల శివరామకృష్ణతో న్యూజెర్సీలో ఎన్ఆర్ఐలు

తెలుగుజాతికి గుర్తింపు తెచ్చిన ఎన్టీఆర్

● న్యూజెర్సీలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరామకృష్ణ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతికి ఒక గుర్తింపు తెచ్చిన కారుణజన్ముడు ఎన్టీఆర్ అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ అన్నారు. అమెరికాలోని న్యూజెర్సీలో ఆదివారం ఆత్మీయ సమావేశం ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులతో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో నందమూరి తారకరామారావు, డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటాలకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో బాలాజీ వీర్నాల, సుమన్ పూదోట, రవి పొట్లూరి, ఎన్ఏటీఎస్ ప్రెసిడెంట్ శ్రీహరి మందాడి, హరిబాబు, అజయ్ వడ్లమూడి, జాగర్లమూడి, వంశీ వెనిగళ్ల, పవన్ చెన్నుపాటి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన ఐనవోలు పోలీసులు



తల్లి ఇద్దరు పిల్లలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ బీవీ కృష్ణారావు

నూజెండ్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివాహిత ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన కేసులో ఐనవోలు పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు సోమవారం తెలిపిన వివరాలు ప్రకారం ప్రకాశం జిల్లా దొనకొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన తోట గురువర్దని భర్త వెంకటేశ్వరరావుతో మనస్పర్థల కారణంగా వారం క్రితం మండలంలోని కొత్త జెడ్డావారిపాలెంలోని పుట్టింటికి వచ్చింది. కాగా ఈ నెల 27వ తేదీన ఇంటి నుంచి పిల్లలతో వెళ్ళిన గురువర్దని అత్తగారింటికి వెళ్ళకపోవటంతో తల్లి పారా సీతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు విషయమై ఎస్ఐ బీవీ కృష్ణారావు దర్యాప్తుచేసి గుంటూరులో ఉన్న గురువర్దని, ఇద్దరు పిల్లల ఆచూకీ తెలుసుకొని క్షేమంగా తీసుకువచ్చి వినుకొండలోని ఐనవోలు పోలీసు స్టేషన్‌లో తల్లి సీతమ్మ, భర్త తోట వెంకటేశ్వరరావులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఐనవోలు పోలీసులకు గురువర్దని తల్లి, భర్త కృతజ్ఞతలు తెలిపారు.